# మినీ కథ

# కథ రాయాలని




అహల్యకు కథలు రాయాలని వుంది. ఒకశుభ ముహూర్తం చూసి కథ రాయాలనుకుంది. పెన్నుకోసం అలమారులో, డ్రాయరులో చూసింది కనిపించలేదు. ముందు గదిలో ఆడుకుంటున్న పిల్లలిద్దర్ని పిలిచి అడిగింది. "నా పెన్నేదిరా మీరుగాని తీసారా?" సురేష్ తమ్ముడికేసి చూశాడు. తమ్ముడు రమేష్ అన్నయ్యకేసి చూశాడు.

"పెన్ను తీసారా అంటే ఇద్దరు అట్లా మొహ మొహాలు చూసుకుంటారా ?" కోపంగా అంది అహల్య.

"మరే అన్నయ్య పెన్ను పాళీ విరక్కొట్టేసాడు!"

"నేనా! నువ్వేగా లాగి క్రిందపడేసింది! నాచేతిలోంచి వాడే లాక్కున్నాడు మమ్మీ! వాడే పడేసాడు"

పోనీ పెన్సిలుఇవ్వు" అంది పెద్దవాడిని చూసి తన కథ రాయాలన్న మొదటి ప్రయత్నం విఘ్నం కాకుండా. పెన్సిలు ఇచ్చాడు.

"ఇదేమిటి?" ఆశ్చర్యంగా అంది పెన్సిలు వంక చూస్తూ. ప్రొద్దున స్కూలుకి వెళ్ళేటప్పుడేగా పెద్ద పెన్సిలు ఇచ్చాను. అప్పుడే ఇంత చిన్నది అయిపోయిందేమిటి?" అంది.

"అది పిచ్చి పెన్సిలు మమ్మీ! దాని ములుకు అస్తమానం విరిగిపోతుంది. ఎన్నిసార్లు చెక్కినా కూడ! చూడు నా చెయ్యి నా వ్రేలు ఎలా కోసుకుందో" ఫిర్యాదు చేస్తున్నట్టుగా అన్నాడు.

పెన్సిలు చెక్కి పాడుచేసింది చాలక తనే మంచి పెన్సిలు కొనివ్వలేదని తనను దబాయిస్తున్న కొడుకు తెలివితేటలకు నవ్వుకుంది. "ఛీ! మొదటి ప్రయత్నంలోనే విఘ్నం."

• • •

మర్నాడు ఉదయం లేచిన దగ్గర్నుండి అహల్యకు కథ రాయాలన్న ఆదుర్దాయే. తొందరే. ఆఫీసుకు వెళ్ళబోతున్న భర్తతో అంది "నాకొక మంచి పెన్ను తెచ్చి పెట్టండి!"

"ఎందుకు!?" ఆశ్చర్యంగా అన్నాడు. "మళ్ళీ కథలు రాద్దామన్న పిచ్చి పట్టిందా ఏమిటి!" అల్లరిగా అన్నాడు.

"ఊ!" కోపంగా మూతి ముడిచింది అహల్య.

ఒక పావు గంటలో మంచి పెన్ను కొనుక్కొచ్చి భార్య చేతికిచ్చాడు శ్రీధర్.

"అమ్మో! ఇంత మంచి పెన్నే!" అంది అహల్య కంగారుగా. "డబ్బు సంగతి నీకెందుకు! నువ్వు అడిగితే చౌకరకం పెన్ను తీసుకొస్తానా! నువ్వు మంచి కథ రాయి. సాయంకాలంవచ్చి నేనుచూస్తాను." అని గబగబ భోజనంచేసి పిల్లలిద్దర్ని స్కూలు దగ్గర దింపటానికి తను మోటరు సైకిలు మీద ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

పనులన్ని అయ్యాక మధ్యాహ్నం తీరుబాటుగా కూర్చుంది అహల్య. కథముందు రాసి టైటిల్ సెటిల్ చెయ్యాలా లేక టైటిల్ ముందు పెట్టి దాని ప్రకారం కథ రాయాలా! అన్న ఆలోచన తెగలేదు. సరే! ముందర కథ రాస్తాను. టైటిల్ తరువాత! అనుకుని కథ రాయటానికి ఉపక్రమించింది. ఇంతలో కాలింగ్ బెల్ చప్పుడు వినిపించింది. విసురుగా లేచి కోపంగా తలుపు తీసిన అహల్య తెల్లబోయింది. ఎదుటి వ్యక్తిని చూసి పకపకమని నవ్వుతూ లోపలికి వచ్చింది అహల్య ఫ్రెండు విమల. "ఏమిటి! ఎంతసేపటికి తలుపు తియ్యవు! నిద్రపోతున్నావా ఏమిటి?" అంది.

"అబ్బే! లేదు. ఏదో కథ రాస్తూ"అన్న మాటని మ్రింగి ఏదో కథ చదువుతూ వినిపించుకోలేదు! రారా చాలా రోజులకు వచ్చావు."అంటూ స్నేహితురాలిని ఆహ్వానించింది లోపలికి వచ్చేటప్పుడు తన ఫ్రెండుమాటకుండా గబగబ కాగితాలు, పెన్ను దాచేసింది.

• • •

స్కూల్ నించివచ్చిన పిల్లలకు స్నానాలు చేయించటం, వంట, వాళ్ళతో హోం వర్కులు చేయించటంతో రాత్రి ఎనిమిదయింది అహల్య పని అయ్యేసరికి! ఇంకేం రాయను! ఇంకాసేపట్లో ఆయన వస్తారు. రేపు రాస్తాను! అనుకుంది అహల్య నిరుత్సాహంగా.

నీ కథేది! ఇవ్వు చదువుతాను! అన్నాడు శ్రీధర్ రాత్రి.

"మీరు పెన్ను తెచ్చిన వేళ మంచిది

వృంది **మినీ కథ**

కాదు" అన్నది.

"బాబోయ్! ఒకవేళ నువ్వు కథ రాసి పంపిస్తే అది తిరిగివస్తే నన్ను అనవుకదా! మీకు మంచి పెన్ను తీసుకురాలేదని!" భార్యని ఉడికిస్తూ అన్నాడు శ్రీధర్.

నిజంగానే ఉడుక్కుంది అహల్య. "ఇంకా నేను కథ రాసి పంపించకుండానే తిరిగి రావాలని అనండి" కోపంగా.

"ఇవ్వాళ ఏమయినా సరే కథ రాయాల్సిందే!" పట్టుదలగా అనుకుంది అహల్య. మర్నాడు పనలన్ని గబగబ పూర్తిచేసుకొని కథ రాద్దామని కూర్చుంది. ఒక పేరాగ్రాపు రాసింది. తర్వాత పెద్దగా అరుపులు, గోల!

ఏమిటోనని ఆదుర్దాగా కిటికీనుండి బైటికి చూసింది, ఎదురింటి ముందు ఏదో గుంపు! మామిడి కాయలు కోసుకుంటుంటే దొంగల్ని పట్టుకొన్నారు. పరామర్శ చేసి వచ్చి కూర్చుంది. కాని మూడ్ పోయింది.

కాఫీ కలుపుకొని త్రాగి మళ్ళీ రాయటానికి కూర్చుంది.

"అమ్మగారూ" అంటూ బైటనుంచి పిలుపు వినిపించింది.

"సత్తెయ్య గొంతులా ఉందేమిటి!" అనుకుంటూ వచ్చి తలుపు తీసింది అహల్య.

"అమ్మగారూ! చిన్నబాబుకి బాగా జ్వరం వచ్చిందమ్మా స్కూల్లో! టీచరమ్మ చూసి ఇంటికి తీసుకెళ్ళి దింపమంది" అన్నాడు.

"జ్వరమా! వెళ్ళేటప్పుడు బాగానే ఉన్నాడే" అనుకుని బెంగారుగా రిక్షా దగ్గరికి వెళ్ళింది బాబు కళ్ళు మూసుకొని పడుకుని ఉన్నాడు.

"రమేష్!" ఆదుర్దాగా పిలిచింది బాబుని.

గబగబ బాబుని లోపలికి ఎత్తుకొని వచ్చి మంచంమీద పడుకోబెట్టింది. జ్వరం బాగా ఉన్నట్టుంది. రమేష్ కళ్ళు ఎర్రగా మొహం కందిపోయి ఉంది. "సత్తెయ్యా! పెద్దబాబుని తీసుకొని రావటం మర్చిపోకు" అని సత్తెయ్యని హెచ్చరించి వాడిని పంపించి రమేష్‌కు స్కూల్ డ్రస్ విప్పి ఒళ్ళంతా తడిగుడ్డ పెట్టి తుడిచి వేరే డ్రస్ వేసి టెంపరేచరు చూసింది. నూటమూడు పాయింట్ ఆరు డిగ్రీలు ఉంది. మూలుగుతూ పడుకున్న రమేష్‌ని బలవంతాన లేపి మెటాసిన్ టాబ్‌లెట్ వేసి కొద్దిగా కాఫీ త్రాగించింది. రెండు గుక్కలు త్రాగి "ఇంక వద్దు మమ్మీ! దోకు వస్తోంది!" అని తాగలేదు రమేష్.

నుదుటి మీద తడిగుడ్డ వేసి బాబుదగ్గరే కూర్చుంది అహల్య దిగులుగా.

* * *

"ఇవ్వాళ ఏమయినా సరే కథ రాయాల్సిందే!" అనుకుని పట్టుదలగా అహల్య రెండురోజుల తర్వాత కాగితం, పెన్సిలు తెచ్చిరాయటానికి ఉపక్రమించింది.

"ఏం చేస్తున్నావు! ఇంకా లైటు వేసుకోని!" అన్నాడు శ్రీధర్.

"కథ" గొణుగుతూఅంది అహల్య!

"అబ్బ! ఇప్పుడు కథేమిటి! రా పడుకుందాం." అన్నాడు శ్రీధర్.

భర్త మనస్సులోని కోరిక అర్థం చేసుకున్న అహల్య మాట్లాడకుండా కాగితం పెన్ను ప్రక్కనపెట్టి లేచింది. తెల్లవారుఝాము 4గంటలకే నిద్రలేచింది.

బద్ధకంగా మంచం మీదనుండి లేచి ఒక పావుగంటసేపు చల్లగాలి పీల్చుకునేందుకు వరండాలోకి వచ్చినుంచుంది. చల్లని గాలిలో కాసేపు నించునే సరికి నిద్రమత్తు వదిలి పోయింది అహల్యకు ఉత్సాహం, కొత్తశక్తి వచ్చినట్లుఅనిపించింది. కాగితం, పెన్ను తీసుకుని వరండాలో లైటువేసుకొని రాయటానికి మొదలు పెట్టింది. ఒక పావు గంటసేపుతను రాయటానికి ఆలోచించిన ప్లాటు, పాత్రలు గురించి ఆలోచించి రాయటం మొదలుపెట్టి పది నిమిషాలు కాలేదు. కాలింగ్ బెల్లు మోగింది, ఆశ్చర్యంగా వీధితలుపు వైపు గడియారం వైపు చూసింది. అయిదు గంటలయింది. "ఈ టైములో తెల్లవారుఝామున ఎవరు వచ్చి ఉంటారబ్బా!" అనుకుంటూ వెళ్ళితలుపు తీసింది.

ఎదురుగుండా అత్తగారు, మామగారు పెట్టె బెడ్డింగులతో "రండి! రండి!" సంతోషంగా అంది వాళ్ళనుచూసి. ఇంతలో శ్రీధర్ కూడా లేచివచ్చాడు కాలింగ్ బెల్ విని. కాఫీలు. వగైరాలు అయ్యాక మనవళ్ళను ముద్దులాడుతూ "మేము ఈ సారి మీ ఇంట్లో నెలుందామని వచ్చాంరా" అంది శ్రీధర్ తల్లి.

"అదేమిటి! నిన్ను ఎవరు వద్దన్నారు. నేను ఎప్పుడు నా దగ్గరే ఉండమని చెప్తున్నాను. కాని నువ్వే చిన్నకోడలు బిడ్డ, లేకపోతే అక్కయ్య కూతుళ్ళకు పురుటి రోజులనో ఏదో ఒకటి చెప్పి వచ్చి నెల రోజులుకూడా ఉండకుండా వెళ్ళిపోతున్నావు" నిష్ఠూరంగా అన్నాడు శ్రీధర్ తల్లితో, 'ఈ సారి అలా వెళ్ళంలే' అందరు కులాసాగానే ఉన్నారుగా." అంటూ నవ్వింది శ్రీధర్ తల్లి.

గతుక్కుమంది అహల్య ఇంక తన కథలు రాయటానికి ఫుల్‌స్టాప్ పడ్డట్టే.

ఈవిడకి పుస్తకాలు చదివితేనే గిట్టదు. "ఏముంది ఆ పుస్తకాల్లో ఎప్పుడూ ప్రేమించుకోవటాలు. అపార్థాలు 'విడిపోవటాలు, మళ్ళీ కలుసుకోవడాలు' పుణ్యమా పురుషార్థమా! హాయిగా రామాయణ, భారతాలు, భగవద్గీత చదువుకోరాదు!" అంటూ అహల్యను సన్నసన్నగా మందలించేది అహల్య పుస్తకాలు చదువుతున్నప్పుడు చూసి, ఆవిడకి భయపడి అహల్య ఎప్పుడైనా రాత్రిళ్ళుగదిలో కూర్చుని చదువుకునేది! "ఇంక నాకు కథలు రాసే యోగం లేదు కాబోలు" అనుకుంది దిగులుగా తనమీద తనే జాలిపడుతూ.



# వద్దేపల్లి పదాలు

రక రకాలైనట్టి రోగాల కన్నిటికి
రంగునీళ్ళే దిక్కు మనసా!
'మ్యావ్యావ్య'లు యిస్తేను హాస్పి
టల్లో గూడ
మంచి మందులు చిక్కు మనసా!

అరమైలుకైననూ ఆర్టీసీ బస్సులే
అవసరమైపోయె మనసా!
వేలబస్సులువున్న ఏలనోగాని అవి
వేళకైతే రావు తెలుసా!...

జనము కీనాడు అతిచౌకగా
వినోదం
సినిమాయె కలిగించు మనసా:
సెలవు రోజులలోన చెత్త
సినిమాకైన
టిక్కట్లు దొరకవని తెలుసా!